
ప్రజాశక్తి
గురువారం 11 సెప్టెంబర్ 2025



గిరిజనులకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-కొమరాడ

మారుమూల గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి, గిరిజన గర్భిణులకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తేవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు బుధవరాం మండలంలోని రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం గర్భిణులతో కలిసి నిరసన చేపట్టారు. సాంబమూర్తి మాట్లాడుతూ ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం వల్ల కొమరాడ మండలంలో మసిమండ కుంతేసు, పూడేసు, చోళ్లపదం పంచాయతీల నుంచి గర్భిణులు ఆటోలపై పిహెచ్‌సికి వస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఆటోలో వస్తున్న సందర్భంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పార్వతీపురం నుండి కూనేరు, మసిమండ, ఎండబద్రం మీదుగా లంజి గ్రామం వరకు వెంటనే ఆర్‌టిసి బస్సు నడపాలని డిమాండ్‌చేశారు.



ఆయన రూటే సెప'రేటు'

- మాట వినని పోలీసులపై బదిలీ అస్త్రం
- నిజాయతీ అధికారులకు బహుమానం
- ఎక్సైజ్ శాఖలోనూ దందాలు
- మైనింగ్ కంపెనీపై దాడి, ఆ వెంటనే లాలూచీ!

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆయనో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి. అధికారపార్టీకి చెందిన కీలక నాయకుడు. 2024 ఎన్నికల ముందు తొలిసారి రాజకీయ తెరంగేట్రం చేసిన ఆయనపై టిడిపితోపాటు నియోజకవర్గ ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. విద్యావంతుడైన తమ నాయకుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాడని నమ్మారు. కానీ ఏడాది కాలంలోనే ఆయన అసలు రంగు బయటపడింది. ఆయన ప్రజల మనిషి కాదని నిరూపితమైంది. చేసే ప్రతి పనిలోనూ ప్రజాప్రయోజనాల కన్నా స్వప్రయోజనాలే పరమావధిగా వ్యవహరిస్తారని రుజువైంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ఎన్నికైన అనతికాలంలోనే తన ట్రేడ్ మార్క్ చూపించిన ఆయన సొంత పార్టీ కంట్లో నలుసులా తయారయ్యారనేది బహిరంగ రహస్యం. కొద్ది నెలల క్రితం పార్టీ అధిష్టానం పిలిచి పనితీరు మార్చుకోవాలని హెచ్చరించినా ఆయన ఖాతరు చేసినట్లు కనిపించట్లు లేదు. నియోజకవర్గ రాజకీయాల్లో గాని, ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో గాని ఇలాంటి నాయకుడిని ఎలా నియంత్రించాలో అంతు చిక్కని స్థితిలో అధికార పార్టీ నాయకత్వం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ఆయన పనితీరు మార్చుకోకపోతే తోక ఎలా కత్తిరించాలనే దానిపై అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ అధిష్టానం ఆ విధమైన ఆలోచనలో ఉందనే సంకేతాలు అందడంతో త్వరితగతిన లాభదాయక పనులపై దృష్టి సారించారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగానే పోలీసు శాఖలో తన మాట వినని పోలీసులపై బదిలీ అస్త్రం ప్రయోగించారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల పార్వతీపురం రూరల్ సర్కిల్‌కి చెందిన ఓ అధికారిని అకారణంగా బదిలీ చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన స్థానంలో రూ.ఐదు లక్షల బహుమానం ఇచ్చిన అధికారిని నియమించుకున్నారనే గుసగుసలు తెరపైకి వస్తున్నాయి. అంతటితో ఆగకుండా పట్టణ పరిధిలో నిబద్ధతతో పని చేసిన ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌ని కూడా బదిలీ చేయించడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిబంధనల అమలు కోసం పోలీసులు కొన్ని సందర్భాల్లో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వారికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తరతమ భేదాలు లేకుండా చిన్న చిన్న కేసులు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి వ్యవహారాల్లో తనపార్టీ కార్యకర్తలు గాని, అభిమానులు గాని తప్పు చేస్తే మందలించకుండా వారికి మద్దతుగా పోలీసులపై ఒత్తిడి పెంచడం ఆయనకు అలవాటుగా మారింది. కొన్ని సందర్భాల్లో ఆయన మాట వినకుండా నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయడమే ఆ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ చేసిన పెద్ద తప్పిదంగా భావించి బదిలీ చేయించారనే ప్రచారం సాగుతోంది. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా నిజాయతీగా పని చేసిన పోలీసు అధికారులను అభినందించాల్సింది పోయి బదిలీపై సాగనంపడం చర్చనీయాంశమవుతోంది.

ఎక్సైజ్ కేసుల్లోనూ వేలు

పట్టణంలో ఒకటి, రెండు వార్డుల్లో నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయి. ఎక్కడెక్కడ జరుగుతున్నాయో పోలీసులు, ఎక్సైజ్ అధికారులకూ తెలుసు. అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు సారా విక్రయాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. మూడు, నాలుగు కేసులు దాటితే పీడీ యాక్ట్ కింద కేసు పెడతామని హెచ్చరిస్తున్నారు. అమ్మకం దారుల్లో పరివర్తన తీసుకురావడానికి అధికారులు పీడీ కేసుల బెదిరింపు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాల్లోనూ నియోజకవర్గ ప్రజాప్రతినిధి వేలు పెట్టి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. అధికారపార్టీకి చెందిన ఒక వార్డు నాయకుడి ద్వారా ఎక్సైజ్ కేసుల్లో తన మాట నెగ్గించుకోడానికి పావులు కదుపుతున్నారు. ఇటీవల ఓ మహిళ డబ్బులు ఇవ్వలేదని ఆమెపై పీడీ కేసు నమోదు చేయడంతో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కి ఫిర్యాదు చేసింది. డబ్బులిచ్చి సారా వ్యాపారం చేస్తున్న వారిని ఏమీ అనడం లేదని, తాను డబ్బులు ఇవ్వలేదని తనపై పీడీ యాక్ట్ కింద కేసు పెడతామంటున్నారని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వాపోయింది.

గ్రానైట్ కంపెనీతో 'డీల్'!

కొద్ది రోజుల క్రితం అధికారపార్టీకి చెందిన నియోజకవర్గ ప్రజాప్రతినిధి తన అనుచర గణంతో బడిదేవర కొండపై ప్రత్యక్షమై హడావుడి చేశారు. మైనింగ్ తవ్వకాల వల్ల సమీపంలో ఉన్న గిరిజనులు నష్టపోతున్నారని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని మొసలి కన్నీరు కారుస్తూ గర్జించారు. మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇది జరిగి రెండు వారాలు దాటింది. ఇటీవల బడిదేవర కొండ సమీపంలో ఉన్న చెరువులో మునిగి పోయిన సంఘటనలో గిరిజనుడు బంగారి దొర మృతి చెందాడు. గ్రానైట్ తవ్వకాల వల్ల విడుదలైన బూడిద సమీపంలో ఉన్న చెరువులోకి చేరడంతో ఊబిలా తయారైంది. ఇది తెలుసుకోని గిరిజనుడు ఎప్పటిలాగే చేపల వేటకు దిగి మృత్యువాత పడ్డాడు. మతి చెందిన గిరిజనుడి కుటుంబానికి ఎంతో కొంత పరిహారం కూడా ఇప్పించే ప్రయత్నం చేయని ఆ పెద్ద మనిషి.. కంపెనీ యాజమాన్యంతో లాలూచీ పడ్డారనే ప్రచారం సాగుతోంది. రూ.లక్షల్లో డీల్ కుదరడంతోనే ఆయన నోరు మెదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఆయన రూటే సెపరేటని నియోజకవర్గ ప్రజలు చెవులు కొరుక్కొంటున్నారు.



పెదమరికి పంచాయతీకి వచ్చిన యూరియా బస్తాలు



ముగ్గురు రైతులకు అందజేసిన యూరియా బస్తా

పెదమరికిలో పెద్దలమాట

ముగ్గురికో యూరియా మూట

రైతుకు 16 కిలోల యూరియా ● దేనికి పనికొస్తుందని వాపోతున్న అన్నదాతలు

ప్రజాశక్తి-పార్వతీపురం

ముగ్గురు రైతులు ఓ యూరియా బస్తా సర్దుకోవాలని పెదమరికి గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ పంచాయతీ పరిధిలో 3 రెవెన్యూ గ్రామాలు, 8 మధుర గ్రామాలున్నాయి. సుమారు 800 మంది రైతులున్నారు. బుధవారం ఇక్కడి రైతు సేవా కేంద్రానికి 10 టన్నుల యూరియా రావడంతో ఎలా పంచుకోవాలని స్థానికులు తర్జనభర్జన పడ్డారు. ముగ్గురు రైతులు ఒక యూరియా బస్తా సర్దుకోవాలని పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు రైతులు సర్దుబాటు చేసుకొన్నారు. నాలుగైదు ఎకరాల భూములున్న రైతుకి 16 కిలోల యూరియా ఎలా సరిపోతుందని కొంతమంది ఆవేదన వ్యక్తంచేశారు. మొదటి విడత కింద కేటాయించిన యూరియా ఏమైందో తెలియదని, ఇప్పుడు వచ్చిన ఎరువుని పెద్దలు ఈ విధంగా పంపిణీ చేశారని గ్రామానికి చెందిన రైతుల్లో గుసగుసలు వినిపించాయి. ఇంతవరకు తమకు యూరియా అందలేదని, 16 కిలోల యూరియాతో పంటలను ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు జిల్లాలో ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సహా వ్యవసాయ శాఖ అధికారులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. కానీ గ్రామస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది.

డబ్బులు పోగేసుకుని.. దారి బాగు చేసుకుని..

ప్రజాశక్తి-మక్కువ

పాలకులు, అధికారుల తీరుపై విసిగిపోయిన మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలో కెగాసిల గ్రామానికి చెందిన గిరిజనులు... అంతా కలిసి గ్రామ రహదారిని బాగు చేసుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి వినతులు సమర్పించినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. దీంతో గ్రామస్తులంతా చందాలు వేసుకుని రహదారిని బాగు చేసుకుంటున్నారు. ఈ గ్రామం మార్కొండపుట్టి ఎంపిటిసి భాగ్యలక్ష్మి సొంతూరు కావడం మరో విశేషం.



పాడైన రహదారిపై గ్రావెల్ వేస్తున్న గిరిజనులు



గెడ్డ వాగు దాటుతూ శ్మశానానికి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గిరిజనులు

ఆఖిరి మజిలీకీ అవస్థలే

గెడ్డ దాటేందుకు అగచాట్లు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పి.ఆమిటి పంచాయతీ కారివలస గ్రామంలో గిరిజనులు శ్మశాన వాటికకు వెళ్లేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే శ్మశాన వాటికకు తీసుకువెళ్లేందుకు గ్రామ సమీపంలో ఉన్న గెడ్డ దాటాల్సిందే. వర్షాకాలం వచ్చిందంటే చాలు గిరిజనుల కష్టాలు వర్ణనాతీతం. గ్రామంలో ఆరిక జయలక్ష్మి అనే గిరిజన మహిళ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. గ్రామం నుంచి శ్మశానవాటికకు మృతదేహాన్ని తరలించేందుకు నడుము లోతు నీరు ప్రవహిస్తున్న గెడ్డలో దాటి వెళ్లాల్సి రావడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. గత కొన్నేళ్ల నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గెడ్డపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎలుగులమెట్టను కొల్లగొట్టేందుకు కుట్ర

- గుట్టుచప్పుడు కాకుండా ప్రజాభిప్రాయ సేకరణ
- తీవ్రంగా వ్యతిరేకించిన పెదబొండపల్లి, కారాడవలస గ్రామస్తులు
- తవ్వకాలకు అంగీకరించబోమని అధికారులకు స్పష్టం



ప్రజాభిప్రాయ సేకరణలో నిలదీస్తున్న గ్రామస్తులు, గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-పార్వతీపురం

మండలంలో మైనింగ్ పేరుతో ఎలుగుల మెట్ట కొండని కొల్లగొట్టేందుకు రంగం సిద్ధమైంది. మెస్సర్స్ వెంకట సాయి గ్రానైట్స్ అనే కంపెనీకి ఈ కొండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతి మంజూరు చేసినట్లు తెలుస్తోంది. సర్వే నెంబర్ 62/1లో 3.46 ఎకరాలు, సర్వే నెంబర్ 63లో 10.33 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ కొండపై కలర్ గ్రానైట్ తవ్వకాలకు అనుమతి మంజూరైంది. పెదబొండపల్లి, హెచ్.కారాడవలస సమీపంలో ఉన్న ఎలుగుల మెట్ట కొండపై గ్రానైట్ తవ్వకాలకు సంబంధించి అనుమతుల కోసం బుధవారం గుట్టుచప్పుడు కాకుండా అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. హెచ్.కారాడవలస గ్రామ సమీపంలో ఉన్న కొండకి దగ్గరలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు సమీప గ్రామాల ప్రజలకు ముందుగా ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. డిఆర్‌ఒ కె.హేమలత, పర్యావరణ శాఖ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత ఉత్తరాంధ్ర జెఎసి అధ్యక్షులు జెటి రామారావు గ్రానైట్ తవ్వకాలకు అనుకూలంగా మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీనిపై పెదబొండపల్లి ఎంపిటిసి ప్రతినిధి మండల పకీర్ నాయుడు, కారాడవలసకి చెందిన మహిళా నాయకురాలు పెద్దిరెడ్ల శ్రీవాణి ఆధ్వర్యాన గ్రామస్తులు ముక్తకంఠంతో అడ్డుకున్నారు. గ్రామంతో సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ మాట్లాడొద్దని వ్యతిరేకించారు. కొండ చుట్టూ వందలాది ఎకరాల భూములు ఉన్నాయని, తవ్వకాలు జరిపితే తమ జీవితాలు నాశనమవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. రూరల్ ఎస్ఐ సంతోషి ఆధ్వర్యాన పటిష్ట పోలీసు భద్రత నడుమ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గ్రామస్తులకు తెలియజేయకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని ఆనోటా ఈనోటా తెలుసుకున్న రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని సభ జరగకుండా అడ్డుకున్నారు. దీనిపై డిఆర్‌ఒ హేమలతకు గ్రామాల పెద్దలు వినతిపత్రం అందజేశారు. అనంతరం డిఆర్‌ఒ హేమలత మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సహజ వనరులు అమ్మడమే ప్రభుత్వ విధానమా?

ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా గ్రానైట్ కంపెనీలకు సహజ సంపదను అమ్మడమే టిడిపి కూటమి ప్రభుత్వ విధానమా? అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. పార్వతీపురం మండలం కారాడవలస, పెదబొండపల్లి రెవెన్యూ పరిధిలోని ఎలుగుల మెట్టను గ్రానైట్ కంపెనీలకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించిన సందర్భంగా ప్రజలందరూ గ్రానైట్ తవ్వకాలు వద్దని స్పష్టంచేసిన నేపథ్యంలో తక్షణమే మెట్టపై తవ్వకాల ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మండలంలో బోడికొండ, బడిదేవర కొండ మైనింగ్ చేయడం వల్ల పర్యావరణానికి, తాగునీటికి, వ్యవసాయానికి ముప్పు వాటిల్లుతుందని వివరించారు.

వృత్తిదారులకు రుణ సదుపాయం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని మైనారిటీ చేతి వృదారులను ఆర్థికంగా ప్రోత్సహించే దిశగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు మైనారిటీస్ ఫైనాన్సు కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ మహబూబ్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్ల నిండిన మైనారిటీల్లోని (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శికులు)18 రకాల వృత్తి పని చేసుకునే వారు ఈ పథకానికి అర్హులని చెప్పారు. సంప్రదాయ చేతివృత్తులైన వడ్రంగి, బంగారు ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు తయారుచేసే వారు, బుట్టలు/చాపలు, మట్టి పాత్రలు తయారుచేసే కుమ్మరులు, చీపుర్ల తయారీదారులు, దోబీ, టైలర్, చేపల వలలు తయారు చేయువారు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు క్షవర వృత్తిదారులు, సంప్రదాయ బొమ్మలు, పూలదండలు, పడవల తయారీ దారులు, ఇంటి తాళాలు తయారీదారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వం వద్ద నుంచి ఎలాంటి రుణాలు తీసుకుని ఉండరాదని, కుటుంబంలో ఒకరు మాత్రమే ఈ పథకానికి అర్హులని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే పథకానికి అనర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత ఉన్న వృత్తిదారులు తమ ధృవీకరణ పత్రాలతో మీ సేవా, సిఎస్‌సి కేంద్రాల్లో www.pmvishwakarma.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టంచేశారు. ఇతర వివరాల కోసం కార్యనిర్వాహక సంచాలకులు, మైనారిటీస్ ఫైనాన్సు కార్పొరేషన్, విజయనగరం వారిని సంప్రదించవచ్చని వివరించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీకి మించి

- ఇలాంటి నిర్బంధాలు ఎన్నడూ చూడలేదు
- ప్రభుత్వంపై మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆగ్రహం

ప్రజాశక్తి-సాలూరు

దేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ కాలంలో కూడా ఎపిలో కనిపిస్తున్న నిర్బంధాలు చూడలేదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర విమర్శించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో విధించిన ఎమర్జెన్సీ కాలంలో కూడా రాష్ట్రంలో ఎదురవుతున్న నిర్బంధాలు లేవన్నారు. రాష్ట్రంలో యూరియా సహా ఎరువుల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 9న ఆర్‌డిఒలకు వినతులు అందజేయడానికి నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా ఆటంకం కల్పించిందని మండిపడ్డారు. అనేకమంది వైసిపి నాయకులను నిరసన కార్యక్రమాలకు హాజరు కాకుండా గృహ నిర్బంధంలో ఉంచిందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీ నాయకులుగా రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసే హక్కునీ ప్రభుత్వం హరించిందని ఆరోపించారు. ఎరువుల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పంటల దిగుబడి కోసం రైతులు ఎంతకైనా కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. పంటలకు సకాలంలో ఎరువులు అందించలేని సర్కారు రైతు పక్షపాతి ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్‌లో వరితో పాటు మిగిలిన పంటలకు మెరుగైన దిగుబడి కోసం అనేక దశాబ్దాలుగా రైతులు యూరియా, డిఎపిలను వినియోగిస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా టిడిపి కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులు యూరియా వాడకం మంచిది కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని రాజన్నదొర డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఎనీమియాపై ప్రత్యేక శ్రద్ధ

ఐసిడిఎస్ అధికారులను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఎనీమియా ఎక్కువగా ఉందని, దానిని పూర్తిగా నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో పాటు ఐసిడిఎస్, డిఆర్‌డిఎ ద్వారా అనేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గర్భిణులకు 21 రకాలు కలిగిన అదనపు కిట్లను ఐసిడిఎస్ ద్వారా పంపిణీ చేస్తున్నామని, తద్వారా గర్భిణుల్లో రక్తహీనత సమస్య తలెత్తరాదని అన్నారు. అయినప్పటికీ రక్తహీనత ఉంటే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఐసిడిఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పోషకాహారం కలిగిన కిట్లు పంపిణీ చేయడంతోనే బాధ్యత అయిపోదని, వాటిని సక్రమంగా గర్భిణులు తీసుకునేలా చూడాలని చెప్పారు. ప్రతీ మాసం రక్త పరీక్షలు నిర్వహించి, రక్తహీనత సమస్య నివారణకు తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత కలిగిన మహిళలు, విద్యార్థినుల పట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, తద్వారా ఎనీమియా ముక్త్ పార్వతీపురం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రక్తహీనత కలిగిన గర్భిణులకు ప్రతి వారంలో ఒక రోజు పౌష్టికాహారాన్ని అందించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. సిడిపిఒ పరిధిలో ముగ్గురు సూపర్ వైజర్లు, ఐదుగురు అంగన్వాడీ వర్కర్ల ద్వారా వారి పరిధిలో ఐసిడిఎస్ ప్రతిపాదించిన లక్ష్య సాధనలో సాధించిన విజయాలను, బెస్ట్ ప్రాక్టీస్‌ను ఇతరులకు తెలియజేయాలని ఆదేశించారు. తద్వారా మిగిలిన సిడిపిఒల పరిధిలో లక్ష్యాల సాధనకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఐసిడిఎస్ ద్వారా పంపిణీ చేసే టేక్ హోమ్ రేషన్ విధిగా ప్రతి గర్భిణీ ఇంటికి చేరాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. అపార్ ఐడిల జనరేషన్ త్వరగా కావాలని, వయసుకు తగిన బరువు, ఎత్తు పిల్లల్లో ఉండాలని, అలా లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, సిడిపిఒలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

12 డయల్ యువర్ డిపిటిఒ

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని ప్రజా రవాణా సమస్యలపై 12న డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 99592 25605 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని ఆయన కోరారు.

16న వీరఘట్టం మండల సమావేశం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎరువుల సమాచారానికి కాల్ సెంటర్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో యూరియా, ఎరువుల సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కాల్ సెంటరును ఏర్పాటుచేసినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎరువులు, యూరియాకు చెందిన ఏవైనా సూచనలు, మార్గదర్శకాలు, సమాచారం కోసం కార్యాలయ పనివేళల్లో (సెలవు రోజులు మినహా) 08963-359853 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

రమేష్ సేవలు అభినందనీయం

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం



డిడి రమేష్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా పనిచేసిన లోచర్ల రమేష్ సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కొనియాడారు. డిడిగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై గుంటూరుకు వెళుతున్న రమేష్‌కు బుధవారం కలెక్టర్ ఆయన ఛాంబరులో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికపుడు సమాచారాన్ని చేరవేయడంలోనూ, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను వారికి అందించడంలో, పత్రికల్లో వచ్చిన ప్రతికూల వార్తలను అధికారులకు చేరవేసి, వారి నుండి స్పందన తీసుకోవడంలో మంచి పనితీరును కనబరచారని అన్నారు. తెలుగు భాష, సాహిత్యంపై మంచి పట్టు ఉందని, దాన్ని కొనసాగించాలని కోరారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కూడా రమేష్‌ను సత్కరించారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెకె కుమార్ వర్మ.. పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పన్నుల బకాయిలతోపాటు ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల వసూలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. 15 పంచాయతీలలో జరుగుతున్న స్వమిత్వ సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో క్లాప్ మిత్రలకు జీతాలు చెల్లించాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాలలో అవగాహన సదస్సు

సీతంపేట : మండలంలో బుడగరాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అగ్నిప్రమాదాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలా చర్యలు తీసుకోవాలో విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి గ్రామంలో ద్రవ జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి పి.శంకర రావు కోరారు. ప్రకృతి వ్యవసాయ పంటలు ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.శేఖర్, రెవెన్యూ, సచివాలయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విక్రమపురంలో మెగా వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోనే విక్రమపురం గ్రామంలో గురువారం శ్రీవిజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాసితులు కోరారు.

'ఆది కర్మయోగి'తో గ్రామాల అభివృద్ధి

కొమరాడ : ఆది కర్మయోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలో కొండకూనేరు, కూనేరు గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్‌పై ర్యాలీ చేపట్టారు. సమస్యలను గుర్తించి, అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామాల్లో 23 పనుల వరకు గురించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్ బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

వంగర: ఈ నెల 12న ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.రఘునాథాచారి బుధవారం తెలిపారు. ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

పక్కా ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

నెల్లిమర్ల: పక్కా ఓటర్ల జాబితా తయారీలో అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ ఎం.నూకరాజు సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, పక్కా ఓటర్ల జాబితా తయారీకి ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు నిత్యం కృషి చేస్తున్నారని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకులు అవగాహన కల్పించి పోలింగ్ స్టేషన్లో భవనాల పరిస్థితి, మౌలిక సదుపాయాలు విషయంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు కె.శ్రీకాంత్, ఎన్వి రమణ, రాజారావు, రమణమ్మ, ఎన్నికల డిటి తహశీల్దార్ వివి ఆర్ జగన్నాథ రావు, రాజకీయ పక్షాల నాయకులు గేదెల రాజారావు, రేగాన శ్రీనివాసరావు, కనకల పద్మనాభం, ఎం. పాపారావు, డి. కామేశ్వరి పాల్గొన్నారు

అండర్ 14,17 టేబుల్ టెన్నిస్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండ్ 14 ,17 బాల బాలికల టేబుల్ టెన్నిస్, మాల్కంబ్ జట్ల ఎంపిక పిఎస్ఆర్ స్కూల్ రింగ్ రోడ్డులో బుధవారం జరిగింది. పోటీలను జిల్లా ఉప విద్యా శాఖ అధికారి కె.వెంకటరమణ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ద్వారా మెరుగైన జీవితం, విద్యార్థులు క్రమశిక్షణ, పోటీతత్వం ఏర్పడతాయన్నారు. పాఠశాల నుంచి క్రీడలు ద్వారా ఆసక్తి పెంచుకోవడం ద్వారా బాగా ఆడటం ద్వారా మంచి క్రీడాకారులుగా ఉండటంతో పాటు, ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో 120 మంది క్రీడాకారుల హాజరయ్యారని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి తెలిపారు.

సాయి అకాడమీలో చేరేందుకు ఎంపికలు

విజయనగరం టౌన్ : సాయి అకాడమీలో చేరేందుకు విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో గల సాయి హాస్టల్ నందు బాల బాలికల వాలీబాల్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అకాడమీ కోచ్ సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో గల 14ఏళ్లలోపు వారు ఈ ఎంపికలకు ఈనెల 14వ తేదీలోగా పోర్టు స్టేడియంలో హాజరు కావాలని వాలీబాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, కెవిఎఎన్ రాజు తెలిపారు.

రణభేరిని విజయవంతం చేయాలి

యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-సీతానగరం



రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఈ నెల 15 నుంచి చేపట్టే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ పిలుపునిచ్చారు. మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి రణభేరి వాల్‌పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు పరిష్కారం చూపడం లేదని, బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులను పాత స్థానాల్లో కొనసాగిస్తున్నారని చెప్పారు. మూడు నెలలుగా ఎంటిఎస్ ఉపాధ్యాయుల జీతాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ పాఠశాలలు కుంటుపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని, బోధనేతర కార్యక్రమాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 25న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగింపేట జూనియర్ కళాశాల విద్యార్థినులకు వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యాన బుధవారం రక్తహీనతపై అవగాహన కల్పించారు. మిషన్ శక్తి స్కీం కింద రక్త హీనత ఎనీమియా గురించి అవగాహన కల్పిస్తున్నామని సెంటర్ నిర్వహణాధికారి జి.శాంతి కుమారి చెప్పారు. రక్తహీనత రాకుండా ఎలాంటి పోషకాహారం తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు బాలికలు రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ శాంతి కుమారి, కౌన్సిలర్ పల్లవి, కేసు వర్కర్స్ భారతి, గౌరీ, సోషల్ వర్కర్ రమ్య , ఎంపిహెచ్‌డబ్ల్యు లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నారంశెట్టికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నారంశెట్టి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణానికి చెందిన కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు కార్యర్శి పురస్కారం లభించింది. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో ఆర్ట్ ఫౌండేషన్, త్రివర్ణ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన మహాకవుల జయంత్యోత్సవ సభలో మహాకవి కాళోజీ స్మారక కార్యర్శి పురస్కారాన్ని ప్రదానం చేశారు. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి.. నారంశెట్టికి పురస్కారాన్ని అందజేశారు. నారంశెట్టికి పురస్కారం రావడం పట్ల పట్టణంలోని ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర, పెద్దూరు గ్రామాలకు చెందిన అల్లు సత్యనారాయణకు రూ.1,85,000, పైలా జగదీష్‌కి రూ. 1,69,323 సిఎం సహాయనిధి చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గరుగుబిల్లి మండల నాయకులు మరడాన తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, నారాయణస్వామి నాయుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





గుమ్మలక్ష్మీపురం, సీతంపేటలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ కల్పన, ప్రిన్సిపల్ సుశాంత్

ఆత్మహత్యాయత్నం నేరం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆత్మహత్యకు ప్రయత్నించడం నేరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ వి.కల్పన అన్నారు. తీవ్ర మనోవేదన నుండి బయట పడటానికి పరిష్కారం ఆలోచించాలే గాని ఆత్మహత్యే శరణ్యం కాదని తెలిపారు. ప్రపంచ ఆత్మహత్య ముందు జాగ్రత్త దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కల్పన మాట్లాడారు. తీవ్ర మానసిక వేదనకు గురయ్యేటప్పుడు ఒంటరిగా ఉండకుండా మిత్రులు, అధ్యాపకులు, పెద్దలతో సమస్యను చర్చించుకుంటే పరిష్కారం దొరుకుతుందన్నారు. పనిభారం పెంచుకోవడం ద్వారా ఆత్మహత్య ఆలోచనలు దూరం కాగలవని చెప్పారు. మనో నిబ్బరం కలిగి ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, తులసి, సత్యారావు, చిన్నారావు, జమ్మయ్య పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆత్మహత్యల నివారణకు విద్యార్థులతో టాస్క్‌ఫోర్స్ అనే అంశంపై ప్రిన్సిపల్ సుశాంత్ జన అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్ రావు, అధ్యాపకులు మంజుల, నరేష్, విజయలక్ష్మి, రవి, కిరణ్ కుమార్, లలిత కుమారి పాల్గొన్నారు .

మక్కువ ఎంపిడిఒగా అర్జునరావు

ప్రజాశక్తి-మక్కువ



బాధ్యతలు స్వీకరిస్తున్న అర్జునరావు

మక్కువ ఎంపిడిఒగా ఎన్.అర్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపిడిఒ స్వరూపారాణి సెలవుపై వెళ్లడంతో ఆయనకు ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణతో కలిసి కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం ఎంపిడిఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా శ్రీనివాసరావు బుధవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ త్రివిక్రమ రావు ఉద్యోగోన్నతిపై డ్వామా ఎపిడిగా జిల్లా కేంద్రానికి వెళ్లడంతో ఆయన స్థానంలో డిప్యూటీ ఎంపిడిఒకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలో అధికారులను సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కేదారిపురం గ్రామస్తులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఎల్.హరిగోపాల్, పి.అరుణకుమారిని గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల వారు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఎంతగానో కృషి చేస్తున్నారని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి భారతమ్మ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బి.ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు అడ్డాకుల గుండునాయుడు, తదితరులు పాల్గొన్నారు.


చేసిన సేవలతో గుర్తింపు

ప్రజాశక్తి-వీరఘట్టం

చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎంఇఒ డి.గౌరునాయుడు అన్నారు. మండలంలోని కిమ్మి ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయులు బి.వాసుదేవరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో వాసుదేవరావు దంపతులను బుధవారం సన్మానించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఇఒ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రామ్మోహన్‌రావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి రామారావు, ప్రధానోపాధ్యాయులు జి.సింహాచలం, బి.అప్పలనాయుడు, ఎం.సునీల్, నీటి సంఘం అధ్యక్షులు కొంచాడ రామకృష్ణ పాల్గొన్నారు.



వాసుదేవరావు దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒ, తదితరులు



మావుడిని సన్మానిస్తున్న వైసిపి సాలూరు మండల నాయకులు

మావుడికి సన్మానం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మక్కువ జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాస్‌నాయుడిని ఆ పార్టీ సాలూరు మండల నాయకులు బుధవారం సన్మానించారు. మక్కువ గ్రామంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సాలూరు మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు పెద్దింటి మాధవరావు, నాయకులు పొట్నూరు రమణ, తిరుపతిరావు, అశోక్, బిసు పాల్గొన్నారు.

నానో యూరియాతో రైతులకు మేలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఎడి సత్యవతి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

నానో యూరియాతో రైతులకు మేలని వ్యవసాయ శాఖ ఎడి జి.సత్యవతి తెలిపారు. బుధవారం కరాసువలసలో మండల వ్యవసాయ అధికారి కె.శిరీషా ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్రవరూపంలో ఉండే నానో ఎరువును పంటలపై పిచికారీ చేయగానే ఆకుల ద్వారా నైట్రోజన్ నేరుగా శోషించబడుతుందని తెలిపారు. దీంతో ఎరువుల వృథా తగ్గి, పంటల పెరుగుదల, ఆకుల పచ్చదనం మెరుగుపడతాయని చెప్పారు. నానో యూరియా వాడకంతో పంట దిగుబడులు 8-10 శాతం వరకు పెరుగుతున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. నానో యూరియాతో రైతులకు ఆర్థికంగా మేలని, పర్యావరణానికి హాని కలగదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వంశీ లక్ష్మి, వైస్ సర్పంచ్ అప్పికొండ యుగంధర్, ఎంపిటిసి అప్పికొండ రమాదేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని నల్లబిల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ భానులత మాట్లాడుతూ నానో యూరియా వాడకం పై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. యూరియా అందరికి అందుబాటులోకి వస్తుందని ఈ వారంలో 72 టన్నుల వరకూ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒ స్వాతీకుమారి, ఎఇఒ, విఎఎ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: రైతులు తగిన మోతాదులో యూరియా వాడాలని ఎఒ కెవి రామ్‌ప్రసాద్ సూచించారు. మండలంలోని రెల్లి, కొత్తవలస రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు తగినంతగా పడటం వల్ల వరి పంట ఆశాజనకంగా ఉందని, తగినంత యూరియా అందుబాటులో ఉందని, విడతల వారీగా సరఫరా చేస్తామని రైతులు అధైర్య పడాల్సిన పనిలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ గణేష్, ఎంపిఎఒ కుమారి, ఉద్యాన సహాయకుడు రవి ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని జియన్ పురం గ్రామంలోని బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ సిబి యశ్వంత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించి, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. పంట నాటిన 30 రోజులలోపు ఎకరాకు 20-25 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఎఎ పావని, రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: డెంకాడలో బుధవారం పొలం పిలుసోంది, యూరియా మీ చెంతకు కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.టి రామారావు పాల్గొని మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో కొన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తుందని తెలిపారు. వరి పంటకు రెండవ దపాగా యూరియా వెయ్యకుండా నానో యూరియా ఎకరానికి 500 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్లు నీటిలో కలుపుకొని ఒక ఎకరానికి పిచికారి చేయాలన్నారు. వివిధ పంటలు వేసిన రైతులందరూ ఆ పంటను సెప్టెంబర్ నెలాఖరి లోగా పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.నాగభూషణరావు, ఎఒ టి. సంగీత, ఎఇఒ బి.రామకోటి, పాణిరాజు, ప్రాథమిక వ్యవసాయ సహాయ సహకార సంఘం సిఇఒ సిహెచ్ మహేశ్వరావు, విఎఎ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే జోగారావును సత్కరిస్తున్న ఎస్‌సి సెల్ నాయకులు

18న వైసిపి ఎస్‌సి సెల్ సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈనెల 18న నిర్వహించనున్న జిల్లా స్థాయి ఎస్‌సి సెల్ సమావేశం విజయవంతం చేయాలని ఎస్‌సి సెల్ నాయకులు.. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యే జోగారావును కోరారు. ఈ మేరకు బుధవారం వారిని కలిసి పార్టీ బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి శ్రీనివాసరావు, పార్వతీపురం నియోజకవర్గ అధ్యక్షుడు సుధాకర్, స్టేట్ ఆర్‌టిఐ ప్రధాన కార్యదర్శి దేవుపల్లి నాగరాజు ఉన్నారు.

విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థి పి.కుమారిని బుధవారం ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాథ్ అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలో కుమారి ద్వితీయ బహుమతి సాధించింది. దీంతో ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు ఆమెను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు